# శివసాగరం

శివనామం హరనామం భవహరనామం
సుఖజీవన వరప్రదము నీ శుభనామం ॥శివ॥

సంసారపు సాగరాన్ని దాటడం నా తరమా
ఈర్ష్య అసూయలు వదలటం నాతరమా
కరిగించుము నాలోని కఠిన పాషాణాన్ని
హిమవంతుడి అల్లుడా గిరిశిఖర నాథుడా ! ॥శివ॥

వదలలేను కోరికలు మరువలేను మమతలు
మరపులేని వంచనతో చేశాను పూజలు
కరిగించుము నాలోని కుటిల కర్పూరాన్ని
హారతిగా గైకొనుమా ఫణిహార భూషణ ॥శివ॥

బింకమూ పోలేదు శంకలు తీరలేదు
అసూయపు చీకటిలో అజ్ఞానపు వాకిటలో
తొలగించుము నాలోని ఈ మలిన భావాన్ని
వెలిగించుము నామదిలో విజ్ఞానపు దీపాన్ని ॥శివ॥

కుమిలితిని మనసులో కల్లోలపు సుడులతో
ఉల్లమున లేదయ్యా ఉత్సాహము ఉమాప్రియా
దారితెన్నూ లేక ఈదిన ఈ సముద్రం
దరిచేర్చ రావయ్యా దశకంఠుని దైవమా ॥శివ॥

– నెల్లూరు విజయ కుమార్

# కవి శ్రీనాథ

శ్రీనాథ కవినాథ వినవయ్య మా గాథ
దూరుతున్న మనుషుల నిరంతర చరిత ॥శ్రీ॥

కులమతాలు చెలరేగి కూల్చాయి శాంతిని
విప్లవాలు వర్ధిల్లి తుడిచాయి క్రాంతిని
ఇకనైన రావయ్యా ! ఓ కాంతి పురంజమా
హృదయాలను మరపింప కవితలు వినిపింప ॥శ్రీ॥

కలతలతో కన్నీళ్ళతో కుమిలేరు జనులు
ఆకలితో అలమటించి నీరసించి పోయారు
ఇకనైన రావయ్యా ! ఓ జ్ఞాన దీపమా
నాయకుల నడిపింప నయమైన మార్గాన ॥శ్రీ॥

వాదాలతో, భేదాలతో చెలరేగె కవులు
విద్యార్థుల బుద్ధులను మార్చేరు అనువుగా
ఇకనైన రావయ్యా ! కల్కి అవతారుడిగా
మలినాలను తొలగించ మహారచన చేయ ॥శ్రీ॥

– నెల్లూరు విజయకుమార్